క్లుప్తంగా

పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

మాచర్ల: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్విని యోగం చేసుకొని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యుత్ శాఖ మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతనపాటి సింగయ్య కోరారు. శుక్రవారం డివిజినల్ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 300 యూనిట్లు పైన వినియోగించుకునే 3కేవీ సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.78వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. 250లోపు 2కేవీ విద్యుత్ వినియోగించుకుంటే రూ. 60 వేలు, 150 లోపు 1కేవీ విద్యుత్ వినియోగించుకుంటే రూ.30వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ సోలార్ సిస్టమ్ తీసుకున్న వారికి ఇన్‌స్టాల్ చేసిన మరుక్షణం నుంచే కరెంట్ బిల్లు జీరో అవుతుందని చెప్పారు. 2వ వారంలో సబ్సిడీ పొందవచ్చునన్నారు. డివిజన్ పరిధిలో కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోయాయని, బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖ సహకరించాలని కోరారు.

నేడు పురపాలక సంఘ సమావేశం

మాచర్ల: పురపాలక సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 అంశాలు పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి కో–ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

రేపు తుమ్మకోటలో పంచాంగ శ్రవణం

రెంటచింతల: ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని తుమ్మకోట జనార్ధన స్వామి దేవస్థానంలో పంచాంగ ప్రవచకులు నోరి కోదండరామ్ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు సహకరించాలి

దాచేపల్లి: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలని ముస్లిం నాయకులు కోరారు. నగర పంచాయతీలోని పలు మసీద్‌ల్లో శుక్రవారం ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టంపై కేంద్రం తీసుకున్న నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేశారు. నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్‌లో పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజ ప్రయోజనాలకు, వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు హాని కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.


న్యూ వెల్లంపల్లి ఉప సర్పంచ్‌గా అనిల్‌కుమార్

పిడుగురాళ్లరూరల్: మండలంలోని కొత్త వెల్లంపల్లిలో గత స్థానిక సంస్థల్లో 8 వార్డు మెంబర్లు, ఒక సర్పంచ్ పదవి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులు విజయం సాధించారు. అలాంటి ఉప సర్పంచ్ పదవి ఖాళీ కావటంతో గురువారం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. దానికి వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన సర్పంచ్, వార్డు మెంబర్లు హాజరు కాలేదు. దీంతో ఎన్నిక వాయిదా పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులకు ఫోన్ చేసి కేసులు పెడతామని, జి.అనిల్‌కుమార్‌ను ఎన్నుకోవాలని టీడీపీ నాయకులు హుకుం జారీ చేశారు. గత్యంతరం లేక అనిల్‌కుమార్ ఈనెల 23న టీడీపీ తీర్థం పుచ్చుకున్నాడు. అతనిని టీడీపీ బలపరిచి, ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకుంది.

నాగులగుడిలో వసంత నవరాత్రులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడిలో ఆదివారం నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వెంకటేశ్వరశర్మ శుక్రవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించడం జరుగుతుందని, మహాసరస్వతీ అమ్మవారికి కృపకుపాత్రులు కాగలరని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



నకరికల్లు : మండలంలోని నర్సింగపాడు గ్రామంలో మాసశివ రాత్రిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తుల కొంగు బంగారంగా నీరాజనాలు అందుకుంటున్న మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆయా ఆలయాల్లోని స్వామి వార్లకు విశేష ద్రవ్యాలతో అభిషేకములు చేశారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

సమస్యల కూత

- వేగంగా పారిశ్రామిక అభివృద్ధి
- పేరుకే నడికుడి రైల్వే జంక్షన్..
- కానీ, స్టేషన్లో ఆగని రైళ్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- నత్తనడకన అభివృద్ధి పనులు

గుంటూరు రైల్వే డివిజన్‌లో రెండో అతి పెద్ద నడికుడి రైల్వే జంక్షన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. పేరుకే ఇది రైల్వే జంక్షన్.. ప్రయాణికులు రాకపోకలు సాగించే దగ్గర నుంచి రైళ్లకు హాల్ట్ కల్పించే విషయంలో ఇక్కడ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నడికుడి రైల్వే జంక్షన్‌లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ప్రధాన రైళ్లకు హాల్ట్ కల్పించి సౌకర్యాలు కల్పిస్తే ఆదాయం భారీగా పెరుగుతుంది.



నడికుడి రైల్వేస్టేషన్

దాచేపల్లి: నడికుడి రైల్వే జంక్షన్ నుంచి ప్రతి రోజు 1000 నుంచి 1,500 వందల మంది వరకు ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. సికింద్రాబాద్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై, కొయంబత్తూరుతో పాటుగా పలు ప్రధాన పట్టణాలకు రాకపోకలు సాగిస్తారు. ఈ జంక్షన్‌లో ప్రధాన రైళ్లను ఆపాలని కొన్నేళ్లుగా ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది. నడికుడి మీదుగా రాకపోకలు సాగించే నర్సాపూర్, డెల్టా ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, వందేభారత్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఇక్కడ ఆగావు. ఇక్కడ ఈ రైళ్లకి హాల్ట్ లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైళ్లు ఇక్కడ ఆగడం వల్లనే రైల్వేశాఖకి ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంది.

1వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద రైలు ఆపాలి

నడికుడి రైల్వేస్టేషన్‌లో ప్రధాన సమస్యగా రైళ్ల నిలుపుదల పక్రియ ఉన్నది. ఇక్కడ ఆగే ప్రతి రైలుని రెండవ నంబరు ప్లాట్ ఫాంపై ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకటవ నంబరు ప్లాట్‌ఫాం నుంచి రెండవ నంబర్ ప్లాట్‌ఫాం మీదకు మెట్ల మార్గం ద్వారా వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్ ఫాంపై రైలు ఎక్కాలనే ఆత్రుతలో రైలు పట్టాలను దాడి వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగిన ప్రయాణికులు మరణించిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రయాణికులు రద్దీగా ఉంటే జన్మభూమి, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లను సైతం రెండవ నంబరు ప్లాట్‌ఫాంపై ఆపడం ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. క్రాసింగ్ ఉంటే తప్ప మిగతా అన్ని రైల్వే స్టేషన్లలో ఈ రైళ్లను దాదాపుగా ఒకటవ నంబరు ప్లాట్‌ఫాం పైనే ఆపి ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా చూస్తారు. ఇక్కడ ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని పిడుగురాళ్లకు మార్చారు. దీంతో ఇక్కడ గతంలో చోరీలు కూడా జరిగాయి. ప్రయాణికులకు సరియైన విశ్రాంతి గదులు కూడా ఇక్కడ లేవు. వ్యక్తిగత మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రైల్వేస్టేషన్‌లోని నాలుగు, ఐదు నంబర్ల ప్లాట్‌ఫారాలపై బొగ్గు అన్‌లోడింగ్ చేయటం వల్ల స్టేషన్ పరిసరాలు బొగ్గు దుమ్ముతో అల్లుకుపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నత్తనడకన స్టేషన్ ప్రాంగణంలో పనులు

విన్నవించినా ఫలితం లేదు



నడికుడి రైల్వేస్టేషన్‌లో ఉన్న ప్రధాన సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాం. ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. నర్సాపూర్, డెల్టా, ఫలక్‌నుమా, వందే భారత్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని కోరాం. నడికుడి జంక్షన్ అని పేరుకే తప్ప సౌకర్యాల కల్పనలో మాత్రం వెనుకంజలో ఉంది.

– షేక్ జాకీర్‌హుస్సేన్, నారాయణపురం

రైళ్లకు హాల్ట్ కల్పించాలి



నడికుడి రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలకు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడ సిమెంట్ ఫ్యాక్టరీలు, చిప్స్, ఫల్వరైజ్ మిల్లులు, కెమికల్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే నడికుడి జంక్షన్‌లో వందేభారత్, ఫలకనుమా, ఇంటర్‌సిటీ, డెల్టా, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కల్పించాలి.

– కొమెరబత్తిన విజయ్‌కుమార్, నారాయణపురం

రుణ మేళాకు 506 దరఖాస్తులు

మాచర్ల రూరల్: స్వయం ఉపాధి కల్పించేందుకు శుక్రవారం రుణ అర్హత మేళా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఫణికుమార్ నేతృత్వంలో నిర్వహించారు. 16 గ్రామ పంచాయతీల్లోని 22 గ్రామాల ప్రజలకు 63 యూనిట్లు మంజూరు చేశారు. దీంతో ఒక్కో గ్రామం నుంచి 10 నుంచి 15 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 506 మంది దరఖాస్తు చేసుకుంటే 341 మంది రుణ మేళాకు హాజరయ్యారు.



ఋణమేళా దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఫణికుమార్

2న రుణ మేళా

మాచర్ల:పట్టణ పరిధిలోని లబ్ధిదారులకు కార్పొరేషన్ల ద్వారా బ్యాంకు రుణాల మంజూరుకు ఏప్రిల్ 2వ తేదీ పురపాలక సంఘ కార్యాలయంలో రుణ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆస్తి పన్ను తక్షణమే తగ్గించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య

సత్తెనపల్లి: ప్రజలపై భారం మోపే ఆస్తి పన్నులను తక్షణమే తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన ఆస్తి పన్నులను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 2025 నుంచి ఆస్తి పన్ను పెంపుదలను నిలిపివేయాలన్నారు. ఆస్తి పన్నుకు సంబంధించి జీవో 198, సవరణ చట్టం నెం .44/2020ను రద్దు చేయాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ 100 శాతం రద్దు చేయాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించటానికి గడువు మే నెల ఆఖరి వరకు ఇవ్వాలని, ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ 24 శాతంను రద్దుచేసి బ్యాంకు వడ్డీని గీటురాయిగా తీసుకోవాలన్నారు. ఏ ఆర్థిక సంవత్సరంలో బకాయిలకు ఆ ఆర్థిక సంవత్సరంలోనే వడ్డీ విధించే పద్ధతిని తొలగించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి, నాయకులు జె.రాజ్‌కుమార్, షేక్ మస్తాన్‌వలి, కె.జగన్‌మోహన్‌రావు, పులిపాటి రామారావు, షేక్ సాయిబా, పంతంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యానికి రక్షణ

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర పంటలు వేయడం ద్వారా భూమికి కావాల్సిన సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందని బలిజేపల్లి యూనిట్ ఇన్‌చార్జి టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్‌లో భాగంగా ప్రతి రైతు భూమి విస్తరణ, పంటలు, పాడి పశువుల వివరాలను సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. గణపవరం యూనిట్ ఇన్‌చార్జి కె.జ్యోతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రజలు, రైతులు భాగస్వామ్యమై ప్రకృతి వయ్యసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూ నాయక్, సిబ్బంది నరసింహారావు, రాణి, బాలమ్మభాయి, యలమందమ్మ, నరసింహారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

నవధాన్య విధానంతో అధిక దిగుబడులు

ఏడీఏ హనుమంతరావు

అచ్చంపేట: వచ్చే వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రైతులంతా నవధాన్య విధానం పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. స్థానిక కో ఆపరేటివ్ సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ, అనుబంధ శాఖలైన సెర్ప్, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందితో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు తమ భూములలో నవధాన్య విత్తనాలను చల్లాలన్నారు. అవి మొక్కలుగా మారగానే భూమిలో చీడపీడల నివారణ జరుగుతుందన్నారు. రైతులు తమకున్న భూమిలో పీఎండీఎస్ (నవధాన్య) విధానం ఆచరించడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది, భూమికి కార్బన్ శాతం చేరడంతోపాటు పశువులకు మేతగా కూడా ఉపయోగపడతాయన్నారు. కలుపు శాతం తగ్గుతుందన్నారు. సిబ్బంది రైతులను ప్రకృతి విధానం వైపు తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏపీఎం సలీమ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉషారాణి, జిల్లా ట్రైనీ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు

అనారోగ్యంతో హోంగార్డు మృతి

నకరికల్లు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ హోంగార్డు మృతి చెందాడు. నకరికల్లు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా, డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ.. హోంగార్డు బాబుగా పిలువబడుతూ అందరికీ సుపరిచితుడైన షేక్ మహబూబ్ షరీఫ్(60) శుక్రవారం గుంటూరులో కన్నుముశారు. స్థానికుడైన ఇతను గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతనికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు, ఎస్ఐ చల్లా సురేష్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది, సహచర సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. హోంగార్డు షరీఫ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలి

బెల్లంకొండ: రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ అశ్రఫున్నీసా బేగం తెలిపారు. మండల వ్యాప్తంగా 29,022 మందికి గాను 25,879 మంది ఈ–కేవైసీ చేయించుకున్నారన్నారు. ఇంకా 3,143 మంది ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ–కేవైసీ చేయించుకోని వారు సమీపంలోని రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు. వచ్చే నెల నుంచి రేషన్ పొందాలంటే తప్పనిసరిగా చేయించుకోవాలని, మార్చి 31 వరకు మాత్రమే ఈ అవకాశం ఉందని తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు దుస్తులు పంపిణీ

నకరికల్లు: పేదలు కూడా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. న్యాయవాది షేక్ అలీ బాషా ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్‌లకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పురస్కరించుకొని దుస్తులు పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరి, సాగి శ్రీనివాసరావు, సర్పంచ్ పరసా అంజమ్మ, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఆరోగ్య సర్వే పరిశీలన



సర్వేను పరిశీలించిన శిఖా శ్యాంసన్

అనంతవరం(క్రోసూరు): నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌ను గుర్తించే కార్యక్రమంలో శుక్రవారం మండల ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ మండలం అనంతవరంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షలు నిర్వహిస్తూ, గుండె జబ్బులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించే కార్యక్రమం ఆరోగ్య శాఖ చేపట్టిందన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబిస్తూ, పోషకాహారం తీసుకోవాలన్నారు. గుట్కా, ఖైనీ, పాన్ వంటివి నోట్లో పెట్టుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

దాచేపల్లి: నిరుపేదలకు అండగా ఉంటామని సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి అన్నారు. పొందుగల గ్రామంలో రంజాన్ పండగ సందర్భంగా సర్పంచ్ ఇమామ్‌వలి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. రూ.2వేలు విలువ చేసే నిత్యవసరాలు, చీరెలు, నగదు కిట్‌ను 60మందికి అందజేశారు. పలు మసీద్‌లకు జానీమాజ్‌లు, టోపీలు, తజ్‌బీలు ఇచ్చారు. రామాపురం ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తండా జిలానీ, జానీ, ఆవుల సైదులు, తండా అమీన్, ముడి విక్టర్‌పాల్, చిన్నగద్ద బుడే, షేక్ నాగుల్‌మీరా, తండా పెదజానీబాషా, తండా అబ్బిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాల పంపిణీ చేస్తున్న సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

గురజాల: వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడేజానీ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూపొదించడం జరిగిందన్నారు. 3కోట్ల 75 లక్షల 6 వేల 500 రాబడిగా, అందులో 2 కోట్ల 87 లక్షల 80వేల రూపాయలు ఖర్చుగా అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ బడ్జెట్ నందు తాగునీటి అవసరాలు, సైడ్ డ్రైయిన్లు నిర్మాణానికి , వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టేందుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘం స్టేట్ డెవలప్ మెంట్ ఫండ్ మైనింగ్ తదితర వాటి ద్వారా 6 కోట్ల 40 లక్షల 70వేలు నిదులు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమీషనర్ శివన్నారాయణ, టీడీపీ ఫ్లోర్ లీడర్ నేలవల్లి వరలక్ష్మీ, ఏఈ మహమ్మద్ ఖాసీం, టౌన్ ప్లానింగ్ అధికారిని అనురాధ, కౌన్సిలర్లు తదితరులున్నారు.



నగర పంచాయతీ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న అధికారులు

మాచవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

మాచవరం: మండల కేంద్రం మాచవరం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు ఏసుపొంగు దయామణి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.వెంగళరావు శుక్రవారం ప్రకటించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో గ్రామ ఉప సర్పంచ్‌గా దయామణి పేరును 5వ వార్డు మెంబరు శివరాత్రి వెంకయ్య ప్రతిపాదించారు. 9వ వార్డు మెంబరు షేక్ జానీబేగం బలపర్చడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. తన ఎన్నికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, వార్డు మెంబర్లకు, వైఎస్సార్ సీపీ నాయకులకు ఉప సర్పంచ్ దయామణి కృతజ్ఞతలు తెలిపారు. పిన్నెల్లి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నికకు రెండవ రోజు శుక్రవారం ప్రత్యేక అధికారి ఎ.సురేష్ అధ్యతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సమావేశానికి వార్డు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా వేస్తూ , తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేపినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు తెలిపారు.



ఉప సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దయామణి

ప్రశాంతంగా పది పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు జరిగాయి. సైన్స్ పరీక్షకు 1,200 మంది విద్యార్థులకు గాను 1,170 మంది పరీక్షలకు హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంఈఓ అల్లి సురేష్‌తో పాటు పలువురు అధికారులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

రెంటచింతల: మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన 10వ తరగతి జీవ శాస్త్రం పరీక్షకు 802 విద్యార్థులు హాజరయినట్లు ఎంఈఓ–2 వై. శివనాగేశ్వరావు తెలిపారు. నలుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో కె.సరోజినిదేవితో కలిసి సెయింట్ జోసఫ్స్ హైస్కూల్, సెయింట్ ఆన్స్ పాఠశాల, వైఆర్ఎస్ పాఠశాల, ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ఏపీ డబ్ల్యూజే నూతన కమిటీ ఏర్పాటు

పిడుగురాళ్ల: ఏపీడబ్ల్యూజే పిడుగురాళ్ల నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాల్లో శుక్రవారం జరిగింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పిడుగురాళ్ల శాఖ నూతన అధ్యక్షులుగా గుప్తా పేరయ్య, కార్యదర్శిగా షేక్ రంజాన్‌వలి, కోశాధికారి సూరపు మణికంఠ(చిన్న), ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్, సీహెచ్ నాగేంద్ర, సహాయ కార్యదర్శి యరగాని ఏసుబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వల్లెం మల్లిఖార్జునరెడ్డి, గౌరవాధ్యక్షులు రామిశెట్టి మధుసూధన్‌రావును జిల్లా కమిటీ సభ్యులు గుడె నరసింహారావు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి రమేష్ బాబు, ఏజేయూ మాజీ సభ్యులు ఎం. లక్ష్మణరావు, సీనియర్ జర్నలిస్టులు కొమ్మా మహేష్, జి. నెమలిరెడ్డి,డి. రామారావు, షేక్ బాషా, సయ్యద్ ఆరీఫ్, ఎం. రవీంద్ర, సీహెచ్ రాజేంద్రప్రసాద్, కరిముల్లా, పఠాన్ సైదా, సైదాచారి పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులు

రూ.86 వేలు రికవరికి ఆదేశం

మాచవరం: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మాచవరం మండలంలో చేపట్టిన పనులకు జరిగిన సామాజిక తనిఖీలో మొత్తం రూ. 86,338 లకు రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ సిద్దలింగమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో మొత్తం రూ.4,75,52,094 లకు పనులు జరిగినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టగా పలు చోట్ల చెట్లు నాటకుండానే బిల్లులు చేయడం, పనులు చేయకుండానే మస్టర్లు వేసినట్లు రికార్డులు చేయడం, సచివాలయ సిబ్బందికి పనిదినాలు కల్పించడం లాంటి పలు అంశాలకు సంబంధించి మొత్తం రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో చేపట్టిన పనులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సుమారు రూ.7లక్షలకు రీ ఎంక్వైరీ చేయాలని ఆదేశించారు. మస్టర్ షీట్లలో సంతకాలు, రికార్డులు సక్రమంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేసారు. పేద కూలీలకు పనిదినాలు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. ఏపీడీ మల్లిఖార్జునరావు, విజిలెన్సు అధికారిణి విజయకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు, ఏపీఓ వెంకటేవ్వర్లు నాయక్, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో 300 ఫాం పాండ్లు పూర్తి చేయాలి

అచ్చంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలలో వచ్చే మూడు నెలల కాలంలో రైతుల పొలాల్లో 300 పైగా ఫాం పాండ్లు ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాం పాండ్ల ద్వారా రెండు లక్షల పని దినాలు పూర్తి చేయాలని, ప్రతి ఉపాధి కూలికి రూ.290 నుంచి రూ.300 వరకు దినసరి వేతనం వచ్చే విధంగా సాంకేతిక సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, జూనియర్ ఇంజనీరు బి.రమణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు సీహెచ్ రాజవర్ధన పాల్గొన్నారు.